“అమ్మా! నేను తవ్వుతానే” బతిమాలసాగాడు మూడేళ్ళ పసివాడు. చేతికి అడ్డుపడుతున్న ఆ పసివాడి చేతులను పక్కకి సున్నితంగా నెట్టుతూ అట్లకాడతో మట్టి తవ్వడానికి ప్రయత్నిస్తోంది సీతాలక్ష్మి. ఆ పసివాడి తల్లి.

“ఉండు నాన్నా! గుచ్చుకుంటుందిరా”

“అమ్మా! నన్ను తవ్వనివ్వవే” పేచీకి దిగాడు ఆ పసివాడు.

“నువ్వు తవ్వలేవు నాన్నా! నా మాట వినవూ”

విననంటూ తల అడ్డంగా వూపి పేచీ ప్రారంభించాడు.

“పోనీ, ఓ పనిచేద్దాం, నువ్వు చిన్నవాడివి కదా. మట్టి తవ్వలేవు. అందుకని నేను మట్టి తవ్వుతాను. నువ్వేమో మొక్క నాటుదువుగాని”

“...”

“మరేమో నువ్వు మొక్క నాటావనుకో, దాన్ని జాగ్రత్తగా నీళ్ళుపోసి పెంచావనుకో, చక్కా... నీకు ఆ చెట్టు బోలెడు తీయతీయని పళ్లు యిస్తుంది”

“ఎప్పుడిస్తుంది? సాలోచనగా కళ్ళు విప్పార్చి అన్నాడు పసివాడు.

“పెద్దయ్యాక”

“అంటే ఎప్పుడు” విసుగుగా అడిగాడు.

“నువ్వు నాన్నంత అవుతావు కదా! అప్పుడు”

“...”

“అప్పుడు, ఈ మొక్క కూడా పెద్ద చెట్టు అవుతుంది. మన యింటి మీదికంతా వస్తుంది”

జాగ్రత్తగా విన్నాడు ఆ పసివాడు. ఆ పసివాడి పేరు విశ్వనాథం. అందరూ వాడిని విస్సూ అని పిలుస్తారు.

“అవుతే సరే...” అర్థమయినట్టు తల పంకించి...

“నా మొక్కేది?...” అని అడిగాడు విస్సూ కళ్ళెగరేసి తల్లికేసి చూస్తూ.

ఆ తర్వాత ఎంతో శ్రద్ధగా మొక్కని నాటాడు విస్సూ. ఆ క్షణంలో ఆ మొక్కపట్ల ఆ పసివాడి మనసులో ఓ అపురూపమైన భావన చోటుచేసుకుంది.

** ** **

“అవునోయ్, సీతాలూ! నేను గమనిస్తూనే వున్నాను. మనవాడికి నీలానే మొక్కలు పెంచడం అంటే ఇష్టం సుమా. పొద్దున్న ఓ గంట, సాయంత్రం ఓ గంట ఆ మొక్కలతో గడపకుండా వుండడు సుమా” అతను సీతాలక్ష్మి భర్త సదానందమూర్తి.



# గంగ

సన్నగా నవ్వి అంది సీతాలక్ష్మి “అన్ని మొక్కలూ ఏమోకాని, మామిడిమొక్క వుంది చూశారూ. అదంటే ప్రాణం వాడికి. ఆ మొక్క అసలు వాడే నాటాడు. మేమిద్దరం కలిసి ఆ మొక్కకి ‘గంగ’ అని పేరు కూడా పెట్టాం”

“బాగుంది. మీ తల్లీకొడుకులిద్దరూ కలిసి

## సూర్యమణి

ఆ మొక్కని మనిషిగా మార్చేసారన్నమాట. అయినా ఏ మాటకామాటే చెప్పుకోవాలి. నవనవలాడుతున్న ఆ మామిడిమొక్క నిజంగానే అందమైన ఆడపిల్లలానే వుందోయ్...”

“అప్పుడే ఏం చూసారు, కాపుకు వచ్చినపుడు చూద్దురుగాని దాని అందం...” ముసిముసి నవ్వులు నవ్వుతూ అంది సీతాలక్ష్మి.

** ** **

కథ

“గాలికి తలుపులు కొట్టుకుంటున్నాయి. పెరటి తలుపులు వెయ్యలేదులావుంది...”

“...”

“సీతాలూ! ఎక్కడున్నావు... ఇంకా ఏంచేస్తున్నావు ఇంత రాత్రిలో... కరెంటు కూడా పోయింది. పని ఏదైనా వుంటే పొద్దున్న చేసుకోవచ్చు. తలుపులు వేసి వచ్చి పడుకోవోయ్...”

“అబ్బబ్బ...! మీ ధోరణి మీదే. ఇంట్లో అసలు ఏం జరుగుతోందో కాస్తయినా పట్టించుకోరేం!” దూరంగా విసుగ్గా సీతాలక్ష్మి గొంతు.

“అది సరే, నువ్వేం చేస్తున్నావు అక్కడ...”

“మీ పుత్రరత్నానికి కాపలా కాస్తున్నాను. ఈ గాలిలో ఆ మామిడిచెట్టుకు ఏమైనా అవుతుందేమోనని వాడికి భయమట. అందుకే ఇంత చీకటిలో... ఈ గాలి, వర్షంలో గొడుగు వేసుకొని బ్యాటరీలైటు పెట్టుకొని అక్కడే వున్నాడు. ఏమీకాదు రారా అంటే వినటం లేదు...”

“బాగుంది. వాడికీ చాదస్తం నేర్పించింది నువ్వు కాదూ? అనుకుని ప్రయోజనం ఏముంది”

“నేర్పించాలంటే అందరికీ వస్తాయా, ఏమిటి?”

“ఇంతకీ నీ బాధ, నేను మీతో వచ్చి ఆ చెట్టుకు కాపలా కాయాలనిలా వుంది... ఏం చేస్తాం... వస్తున్నానుండు...”

** ** **

“అమ్మా! గంగని చూడు. ఎంత అందంగా వుందో... అన్నీ కాయలే”

“అవునురా, దానికి మన దిష్టే తగిలేలా వుంది”

“అంత బరువు మోయలేదేమోనే... పాపం”

“ఆడవాళ్ళు కడుపులో బిడ్డను మోయరూ... అలానే”

“అవుతే దానికి నొప్పి ఏమీ వుండదు కదా... దానికి కష్టంగా వుందేమోనని భయం వేస్తోంది నాకు”

“...”

"అమ్మా!"

"ఏమిటిరా!"

"నువ్వు కాదనసంటే నేను ఓ మాట చెప్తాను"

"నీ మాట ఎప్పుడైనా కాదన్నానా"

"లేదనుకో. కానీ, నేను చెప్పేది గంగ గురించి"

"చెప్పేదేదో నాన్చకుండా చెప్పు"

"ఆ కాయలు మనం కోయద్దు అమ్మా. అలానే వుంచేద్దాం"

"..."

"ఏం అమ్మా మాట్లాడవు?"

** ** **

"వుంచేయవచ్చు అనుకో... కానీ పక్షులు వచ్చి కొరికి కింద పడేయకుండా వుంటాయా?"

"అప్పుడే తీసుకుందాంలే అమ్మా"

"..."

"మనం కాయలు కోస్తే గంగకి బాధ కలుగుతుందేమో అమ్మా..."

"..."

"ఆ వూహ కూడా నేను భరించలేనమ్మా"

"నువ్వలా చెప్తుంటే నేను మాత్రం ఏం చెపుతాను. కావాలనుకుంటే కిందపడినవే తీసుకుందాం, సరేనా"

"నువ్వెంత మంచిదానివమ్మా! ఈ విషయం గంగతో చెప్పివస్తాను...ఏం"

"..."

"ఏమిటోయ్ తల్లీకొడుకులు ఏమిటో మాట్లాడుకుంటున్నారు"

"మీరెంతసేపయింది వచ్చి"

"అదే నీ పుత్రరత్నం నిన్ను పొగుడుతున్నపుడు"

"..."

"సమాధానం చెప్పకుండా నవ్వుతావేమోయ్"

"నేనేం చెప్తానూ. అదిగో- ఒకసారి అటు చూడండి. మన విస్సూ ఆ మామిడిచెట్టును ఎంత ప్రేమగా తాకుతున్నాడో... ఎలా కబుర్లు చెబుతున్నాడో... వాడికి అది నిజంగా మనిషే"

"అది రోజూ వుండేదేగా... ఈరోజు కొత్త ఏముందీ"

"కొత్తేమరి. ఇంట్లో మామిడిచెట్టు వుంటే అందరూ కాయలుకోసుకుందాం అనుకుంటారు. కాని విస్సూ అలా కోసుకుంటే ఆ చెట్టుకు బాధ కలుగుతుందంటున్నాడు.

"అబ్బాయిగారు ఆర్డరు వేసాక... అమ్మగారు వత్తాసు పలికాక ఇంక ఎదురేముందీ..."

"మీకు నవ్వులాటలా వుంది"

"పోనీలే చెప్పు. ఏడవమంటావా!"

"నన్ను విసిగించక మీరు వెళ్ళండి. ఆ చెట్టు మీద వాడికి రోజురోజుకీ పెరుగుతున్న ఈ ప్రేమ ఎటు దారితీస్తుందో అని నేను ఓ మూల భయపడుతూ వుంటే..."

"చూడు సీతాలూ! అనవసరంగా ఏమేమో ఊహలు పోయి భయపడటం మానెయ్యి. నిజం చెప్పాలంటే నాకూ చెట్టుకాయలు కోయడం ఇష్టంలేదు. అంతెందుకు. మొన్నటికి మొన్న మీ అన్నయ్య గంగని చూసి అదే మాట అన్నాడు- ఇంట్లో పిల్లలా పెరిగింది. కాయలు కోయకుండా వుంటే బాగుంటుందీ అని. అలాంటిది చిన్నప్పటి నుంచి దానిని ప్రాణంలా చూసుకుంటున్న విస్సూ ఆ మాట అనడంలో ఆశ్చర్యమేముందీ"

> పళ్ళతో నిండుగా గంగ. కింద మూడేళ్ళ వ్యాసు. వ్యాసు తలెత్తి రెండు చేతులూ పైకెత్తడం... గాలికి అటూఇటూ వూగుతున్న ఓ కొమ్మ చూస్తుండగానే కిందకి వంగడం... వ్యాసు చేతుల్లోకి ఓ పండు జారిపడటం... ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయాడు విశ్వనాథం.

** ** **

"అందమైన ఈ వెన్నెలలో చెట్టునిండా పళ్ళతో మన గంగ ఎలా మెరిసిపోతోందో చూశారా"

"చూస్తున్నాను. దిష్టి తగిలేలా వుంది. కళ్ళు తిప్పుకోలేకపోతున్నానంటే నమ్ము"

"అలా అనే నేను రోజూ దిష్టి తీస్తున్నాను తెలుసా..."

"ఆ పళ్ళకోసం చెట్టు మీద చేరిన పక్షులు చేసే హడావుడికి అసలు ఏదో అద్భుతమైన లోకంలో వున్నట్లే అనిపిస్తోంది"

"..."

"ఏం మాట్లాడరే?"

"ఏం మాట్లాడతాను. నా మనసులో మాటే నువ్వు చెప్తుంటే. మాటలతో చెప్పగలిగే అనుభూతా ఇది"

"వద్దన్నా వినకుండా విస్సూ అక్కడే మంచం వేసుకుని పడుకుంటున్నాడు"

"పడుకోనీవోయ్! మనకే ఆ దృశ్యాన్ని చూడటం ఇంత ఆనందంగా వుంటే... వాడి మాట వేరే చెప్పాలా..."

"అదేం విచిత్రమో! కింద పడినా పళ్ళు ఏమాత్రం పాడవటంలేదు. పైగా ఎంతో తీయగా వుంటున్నాయి"

"తిన్న వాళ్ళంతా ఇటువంటి రుచిగల పళ్ళు ఎక్కడా తినలేదంటున్నారు"

"అవునవును. ఆఫీసుకి తీసుకెళ్ళి అందరికీ తలో రెండు పళ్ళు ఇచ్చాను కదా. వాళ్ళూ ఈమాటే అన్నారు. అయినా ఈ పళ్ళలో వున్నది రసమేనంటావా సీతాలూ! గంగకి మన మీద పొంగిపొర్లే అవ్యాజమైన అభిమానం కాదూ..."

"ఎంత బాగా చెప్పారూ..."

** ** **

"ఏమంటోంది నీ కోడలు"

"నా కోడలికేం బంగారు బొమ్మ. వచ్చి పది రోజులే అయినా ఎన్నో రోజుల నుంచి వున్నట్లు ఎంతో కలివిడిగా వుంటోంది."

"..."

"పైగా విస్సూ ఏం చెప్పాడో ఏమిటోకానీ సంధ్య కూడా గంగని ఎంతో గౌరవిస్తోంది"

"ఆఁ... ఆఁ... అదే నేనూ చూస్తున్నా. ఆ అమ్మాయి ఎక్కువ గంగ దగ్గరే కాలక్షేపం చేయడం"

"ఏమైనా గంగ మహిమ ఏమిటోకాని, మన ఇంటికి ఎంతమంది రాలేదూ... దాన్ని చూసి ముచ్చటపడని వాళ్ళు ఒక్కరైనా వున్నారా చెప్పండి"

"ఇందులో మహిమ ఏముంది సీతాలు. ప్రేమప్రేమను కలిగిస్తుంది అంటారు. గంగకి నిలువెల్లా ప్రేమే కదా"



"బాగా చెప్పారు. అదే అంటుంది సంధ్య కూడా. గంగని ముట్టుకుంటే చాలా అపురూపమైన అలౌకికమైన అనుభూతి కలుగుతోంది అని"

"..."

"నాకిప్పుడు చాలా సంతోషంగా వుంది సుమండీ. వాడికి ఎటువంటి అమ్మాయి భార్యగా వస్తుందో...గంగని ఎలా చూస్తుందో అని రకరకాల భయాలు వుండేవి నాకు"

"పైకి అనకపోయినా నాకూ అటువంటి భయాలే వుండేవి. విస్సూ మాట అటుంచి మనం మాత్రం... ఎవరైనా గంగని అగౌరవపరిస్తే భరించగలమా?"

అవునన్నట్టు తల పంకించింది సీతాలక్ష్మి.

** ** **

"ఏమిటే ఆ హడావిడి...ఆఁ"

"ఏమీలేదు. సంధ్య గదిలో లేదు. పచ్చి బాలింతరాలు. బయటికి రాకూడదని చెప్పాను కదా, ఆ పసిగుడ్డును తీసుకుని ఎక్కడికి వెళ్ళిందా అని..."

"ఇంట్లో లేదంటే...గంగ దగ్గరే ఉంటుంది. అక్కడ చూడకపోయావా"

"విస్సూ వద్దన్నాడని పురిటికి పుట్టింటికి కూడా పంపించకుండా మన దగ్గరే వుంచుకున్నాం. పిల్లకేమయినా అయితే మనకెంత మాట"

"పుట్టింటికి పంపించడానికి అక్కడ ఆ అమ్మాయికి ఎవరున్నారని. ముందు ఆ సణుగుడు మాని పెరట్లోకి వెళ్ళి చూడు"

** ** **

"ఏవండోయ్. ఒకసారి ఇలా రండి"


సీతాలక్ష్మి గొంతులో సంభ్రమాశ్చర్యాలు. కంగారుగా పరిగెత్తాడు సదానందమూర్తి. అక్కడి దృశ్యంచూసి సీతాలక్ష్మితోపాటు సదానందమూర్తి నిశ్చేష్టుడయ్యాడు.

సంధ్య కొడుకుని గంగకి చూపిస్తోంది. బిడ్డ చిన్న చేతులు, మొహం, కాళ్ళు...తడవ తడవలుగా బిడ్డ ఒళ్ళంతటిని గంగ మానుకి తాకిస్తోంది.

** ** **

"సంధ్యా! ఏడీ వ్యాసూ కనిపించడేం?"

"ఇంకెక్కడుంటాడత్తయ్యా... గంగ దగ్గరే ఆడుకుంటూ వుంటాడు. వాడికీసారి ఊహ తెలిసిందేమో... గంగ కాయలు తొడగటం అంతా కొత్తగా వుంది. పక్షుల కోలాహలం. చెట్టునిండా కాయలు. వ్యాసుకి చాలా నచ్చుతోంది. అక్కడే పడుకుంటానంటున్నాడు



వాళ్ళ నాన్నతోపాటు"

"అలాగే పడుకోబెట్టక పోయావా... ఈ హడావుడీ- అనుభూతి మళ్ళీ సంవత్సరానికి గానీ రాదు"

"అంటాడు గాని అత్తయ్యా, నిద్రపోడు. ప్రశ్నమీద ప్రశ్న... ఎన్నో ప్రశ్నలు వేస్తాడు. వాడి ప్రశ్నలకి సమాధానాలు చెప్పలేకపోతున్నాననుకోండి"

"ఏమిటి సంధ్యా! నా కొడుకు మీద అమ్మకి చాడీలు చెప్తున్నట్టున్నావు!"

"చాడీలు ఏమున్నాయి. వున్న సంగతేగా ... వ్యాసు ప్రశ్నలకి సమాధానం చెప్పలేకపోతున్నాను అంటున్నాను"

"దేని గురించీ... గంగ గురించేనా" విశ్వనాథం నవ్వుతున్నాడు.

"గంగ గురించి మనమెందుకు చెప్పడం. గంగే చెప్తుంది. ఆఁ"

ఇంతలో వ్యాసు ఎక్కడినుంచో పరిగెట్టుకుంటూ వచ్చి విశ్వనాథం మెడని కావలించుకున్నాడు.

"ఏంటిరా వ్యాసు- అమ్మని నువ్వు విసిగిస్తున్నావా...ఆఁ"

తండ్రి మొహంలోకి మొహంపెట్టి కళ్ళు పెద్దవి చేసి ఓసారి చూసి నవ్వాడు వ్యాసు సంతోషంగా. ఎంత వేగంగా చంకనెక్కాడో అంతే వేగంగా కిందకిదిగి తండ్రిచెయ్యి పట్టుకొని పెరడులో గంగ దగ్గరకి లాక్కెళ్ళాడు.

"నాన్నా... గంగ... పక్షులు... పళ్ళు..." వ్యాసు కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి.

"ఏంటి నాన్నా... బాగుంది కదా" కొడుకు చెంపలు నిమిరి ముద్దుపెట్టుకుంటూ అన్నాడు విశ్వనాథం.

"నాన్నా! నాకో పండు..."

"గంగే నీకు ఇస్తుంది"

"ఎప్పుడు"

"నువ్వు అల్లరి చెయ్యకుండా అమ్మని విసిగించకుండా వుంటే... అప్పుడు. ఇలా ఇలా వచ్చి నీ చేతుల్లో పెడుతుంది"

విశ్వనాథం తన చెయ్యి పైకెత్తి నెమ్మది నెమ్మదిగా దించి వ్యాసు చేతిలో పండు పెట్టినట్లు చేసిన అభినయాన్ని వ్యాసుకళ్ళు విశాలం చేసి చూశాడు. తన చేతిలో తండ్రిచేయి నెమ్మదిగా పైకి లేచి కితకితలు పెట్టడంతో నవ్వసాగాడు.

** ** **

మధ్యాహ్నం పుస్తకాలు సర్దుకుంటూ యథాలాపంగా కిటికీలోంచి బయటకు చూసిన విశ్వనాథం ఆశ్చర్యంతో నిటారుగా నిలబడి, నిశ్శబ్దంగా ముందుకు నడిచి కిటికీ చువ్వలను గట్టిగా పట్టుకొని కళ్ళప్పగించాడు ఆ దృశ్యానికి.

పళ్ళతో నిండుగా గంగ.

కింద మూడేళ్ళ వ్యాసు. వ్యాసు తలెత్తి రెండు చేతులూ పైకెత్తడం... గాలికి అటూ ఇటూ వూగుతున్న ఓ కొమ్మ చూస్తుండగానే కిందకి వంగడం... వ్యాసు చేతుల్లోకి ఓ పండు జారిపడటం...ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయాడు విశ్వనాథం.

అపురూపమైన ఆ దృశ్యం అనుభూతిగా మారి గుండెలనిండా నిండి ఉక్కిరిబిక్కిరి చేసి, అతని ప్రమేయం లేకుండానే అతని కళ్ళలోకి నీళ్ళు రప్పించాయి.

అలా ఎంతసేపు గడిచిందోకూడా తెలియదు. వెనకకి జరగబోయేంతలో విశ్వనాథం ఒంటికి మెత్తగా తగలడంతో ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి చూశాడు. సంధ్య... తనలాగే బుగ్గల మీదుగా చిందుతున్న కళ్ళ నీళ్ళతో...

"చూశావా" మౌనంగా తలూపింది.

సంధ్య భుజం మీదుగా తన చెయ్యి వేసి దగ్గరకు అదుముకున్నాడు విశ్వనాథం. ■

## ఎప్పుడూ...

అవసరాల కూడిక
ఇంట్లో వస్తువులన్నీ
తీసివేత ఎంత బాధో!

అన్ని అధికారాలూ ఇచ్చినట్టే ఉంది
ఆగకుండా అరుస్తూనే ఉంది
ఇంట్లో కుక్క

ఎంత కోరికో నాకు
రాత్రంతా
ఏకాంతంగా
చంద్రుడుని తాగుదామని!



ఆ ప్రయత్నంలోనే ఉంటాను

అంతలోనే-
నేను రాత్రి ఒకేసారి మాయమై
సూర్యకిరణాల వరదలోతేలుతాను

– ముకుంద రామారావు